# ముందుమాట

**వ్య**వసాయ సంక్షోభం అనే ప్రయోగమిప్పుడు సార్వజనీనమయింది. ఆదాయ వ్యయాల లెక్కలు తీస్తే వ్యవసాయం మొత్తం మీద నష్టదాయకంగానే ఉంటుందని పరిశోధకులు సీరియస్‌గానే చెప్తున్నారు. అయినప్పటికీ తిండి అందరికీ కావాలి కాబట్టి వ్యవసాయ సంక్షోభాన్ని రైతులు, రైతు కూలీల నెత్తిమీద పడేయకుండా ఆ బరువును అందరూ మోయాలని అంటున్నారు.

సార్వజనీనమైనా దానికి స్థానిక ప్రత్యేకతలు చాలా ఉంటాయి. కొన్నిచోట్ల సంక్షోభం మిగులు ఆదాయంలోని ఆటుపోట్ల రూపంలో ఉంటే కొన్నిచోట్ల అసలు ఆదాయంలోని ఆటుపోట్ల రూపంలోనే ఉంటుంది. కొన్నిచోట్ల వ్యవసాయం మెరుగయిన జీవితాన్ని ఇవ్వలేకపోతున్నదే అన్నది ఫిర్యాదయితే కొన్నిచోట్ల అసలు జీవితాన్ని నిలపలేకపోతున్నదే అన్నది ఫిర్యాదు.

అత్యల్ప వర్షపాతం, చాలావరకు సారహీనమయిన నేలలు, ప్రత్యామ్నాయ నీటివనరుల లేమి కలిసి అనంతపురం జిల్లాను రెండవ కోవకు చెందిన అతి ప్రముఖమైన ప్రాంతాలలో ఒకదానిని చేశాయి. అయినప్పటికీ బతకాలి కాబట్టి, అత్యధిక మెజారిటీకి వ్యవసాయంలోనే బతుకు ఉంది కాబట్టి, అత్యంత అననుకూలమయిన ఈ పరిస్థితిని కూడా ఎదుర్కొని లక్షలాది రైతులు, కూలీలు బతుకుపోరు సాగిస్తూనే ఉన్నారు. ఎడాపెడా పెరిగిపోయిన వేరుశెనగ సాగు దీనికొక సంకేతం అయింది. ఆ సంకేతమూ ఈరోజు సంక్షోభంలో పడడంతో ఇంక ముందుకెట్లాగ అన్న ప్రశ్న ఈ జిల్లాను పట్టి పీడిస్తున్నది. వ్యక్తులుగా చాలామంది రైతులు ఈ ప్రశ్నకు జవాబు వెతుక్కున్నారు, ఎవరికీ తెలియకుండా దానిని అమలు చేస్తున్నారు. ఐదేళ్లలో ఐదువందల మంది దాకా చనిపోయారు. ఈ చావులను ఆత్మహత్యలు అంటున్నాం. అయితే బతికి కొట్లాడుదాం అనుకున్నవారికి మాత్రం మార్గం కనిపించడం లేదు.

ఈ సంక్షోభ చరిత్ర గురించి, వర్తమాన పరిస్థితి గురించి మానవ హక్కుల వేదిక సీనియర్ సభ్యుడు ఎస్.ఎం.బాషా 'కదలిక' పత్రికలో అనేక పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. వాటన్నిటినీ కలిపి చదువుకున్నట్టయితే వ్యవసాయ సంక్షోభాన్ని గురించి ఒక అవగాహన ఏర్పడగలదని భావించి వాటిని ఒక పుస్తకంగా ప్రచురిస్తున్నాము. ఇదంతా చదివాక బాషా గారు ఈ జిల్లా వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమేదీ చూపలేదే అనేవారు ఉంటారు. నిజమే చూపలేదు. పరిష్కారం కోసం వెతికే పేరుమీద రైతునే నిందించే నీతి ప్రబలంగా ఉన్న ఈ పరిస్థితిలో ముందుగా కారణాల విశ్లేషణ సక్రమంగా సాగేటట్టు చూడడం అవసరం. ఒక తీవ్ర సంక్షోభంలోకి రైతాంగాన్ని నెట్టేసి, ఏదో ఒక విధంగా బతికి బట్టకట్టాలన్న తపనతో పరిస్థితులతో పోరాడుతున్న రైతులను తెలివితక్కువవాళ్లని చేసి, ఆ తెలివితక్కువతనమే పరిష్కారానికి ఆటంకం అని వాదించడం ఇప్పుడు జరుగుతోంది. అంతకంటే అన్యాయం ఇంకొకటి ఉండబోదు. చర్చను దానినుండి బయటపడేసి వాస్తవిక భూమికపైన నిలబెట్టడం ప్రథమ అవసరం. దానికి కావలసిన సమాచారాన్నీ దృష్టికోణాన్నీ అందించడం ఈ వ్యాసాలలో జరిగిన కృషి.

ఈ రోజు అందరూ చర్చిస్తున్న పరిష్కారాన్ని ఆవిష్కరించడంలో ఈ కృషి పనికొస్తుందని మా ఆశ.

1 మే 2005

**మానవహక్కుల వేదిక**

అనంతపురం జిల్లా శాఖ